రెజ్లర్లపై లైంగిక వేధింపులు దుర్మార్గం

- ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి అత్తిలి విమల
- ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ దిష్టి బొమ్మ దగ్ధం

విశాలాంధ్ర - విశాఖ : దేశానికి స్వర్ణ, సిల్వర్ పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లపై ఉత్తరప్రదేశ్ ఎం.పి., రెజ్లర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడటం దుర్మార్గమని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి అత్తిలి విమల దుయ్యబట్టారు. మహిళా రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ విగ్రహం వద్ద శనివారం ఏపీ మహిళా సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య, అఖిల భారత విద్యార్థి సమాఖ్యల అధ్వర్యంలో రెజ్లర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీనిపై ప్రధానికి, క్రీడా రంగానికి సంబంధించిన అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవటంతో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద 18 రోజుల నుంచి న్యాయం కోసం పోరాటం చేస్తున్న వారిపై ఢిల్లీ పోలీసులు మద్యం సేవించి, వారిపై దాడులు చేయటం హేయమైన చర్య అని విమర్శించారు. బిజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆర్.ఎస్.ఎస్., విశ్వ హిందూ పరిషత్, బీజేపీల నుంచి మహిళలపై లైంగిక దాడులు, హత్యలు పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కన్వీనర్ వై రాంబాబు, అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి యు నాగరాజులు మాట్లాడుతూ ఇతర క్రీడా కారులు మద్దతుగా నిలబడాలని మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు. ఫెడరేషన్ అధ్యక్ష పదవి నుంచి బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ ని బహిష్కరించాలని, ఎం.పి. పదవి నుంచి తక్షణమే తొలగించాలని, ఆయన్ని అరెస్ట్ చేసి సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భేటీ బచావో భేటీ పడావో అన్న ప్రధాని మోడీ ఈ సంఘటనపై మౌనం పాటించడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రంలో ఎనిమిది మంది మహిళా మంత్రులు తోటి మహిళా క్రీడాకారుల ఆవేదనపై ప్రధానిపై ఒత్తిడి తేవాలని సూచించారు. వారికి న్యాయం జరిగే వరకూ ప్రజా సంఘాలు పోరాడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.ఏ. బేగం, జి జయ, కె వనజాక్షి విద్యార్థి, యువజన సంఘాల జిల్లా నాయకులు మధు, సందీప్, రమణ, శివ, ఈశ్వర్ విద్యార్థి, యువకులు,మహిళలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ వినోద్ రాజును పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్

విశాలాంధ్ర - యస్. రాయవరం : మండలంలో పెదగుమ్ములూరు గ్రామంలో మాజీ ఎంపీపీ వై.వినోద్‌రాజును ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ వై.వి.వి.బి. రాజేంద్రప్రసాద్ పరామర్శించారు. ఇటీవల వినోద్ రాజు తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన ను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప రెడ్డి, చాంబర్ నాయకులు సుబ్బరామయ్య, అన్నెపు రామకృష్ణ, బొర్రా నాగరాజు, ముత్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపే కేసులో 84 మందికి జరిమానా

విశాలాంధ్ర - ఆనందపురం : మద్యం సేవించి పట్టుబడ్డ కేసులో శనివారం భీమిలి అదనపు 15 మెట్రోపాలిటీ కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరపరచగా జరినామాతో పాటు కమ్యూనిటీ సర్వీసులో భాగంగా వ్యక్తులు పరివర్తన కోసం పరిసరాలు పరిశుభ్రత చేయాలని తీర్పును వెల్లడించినట్లు స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం తెలిపారు. నేషనల్ లోక్ అదాలత్ లో భాగంగా ఆనందపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి పట్టుబడిన కేసులలో పట్టుబడిన వారిని 84 మందిని భీమిలి 15వ అదనపు మెట్రో పాలిటీకోర్టు లో హాజరు పరచగా మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి 1000 జరిమాన ఇందులో 63 మందికి జరిమానతో పాటు కమ్యూనిటీ సర్వీస్ లో భాగంగా బాలికల పాలిటెక్నిక్ కళాశాల పరిసరాలు పరిశుభ్రం చేయించడం జరిగిందని ఎస్ఐ రఘురాం తెలిపారు.

రాష్ట్రంలో బ్లూ ఫ్లాగ్ సర్టిపికేషన్ పొందిన ఏకైక బీచ్ రుషికొండ

మున్సిపల్ కమిషనర్ సిఎమ్ సాయికాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : దేశంలో ఉన్న 12 బీచ్ లలో ఆంధ్ర ప్రదేశ్ లో బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందిన ఏకైక బీచ్ రుషికొండ బీచ్ అని జీవీఎంసీ కమీషనర్ సిఎమ్ సాయికాంత్ వర్మ అన్నారు. శనివారం ఉదయం రుషికొండ బీచ్ వద్ద జిల్లా జాయింట్ కలక్టరు కెఎస్ విశ్వనాథన్, బ్లూ ఫ్లాగ్ ఇండియా అపరేటర్ డా.శ్రీజీ కురుప్ లతో కలసి బ్లూ ఫ్లాగ్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం మన ఆంధ్రప్రదేశ్ బ్లూ ఫ్లాగ్ పొందిన తొలి బీచ్ గా రుషికొండ బీచ్ ఎంపిక కాబడిందని, రాబోయే రోజులలో మరిన్ని బీచ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాడానికి కృషి చేస్తున్నామన్నారు. విశాఖ ప్రజలకే కాక రాష్ట్ర ప్రజలతో పాటు పర్యాటకులకు కలిపించవలసిన భద్రత, సౌకర్యాలు పర్యావరణ సమతుల్యత కల్పించడం కోసం కృషి చేస్తున్నామన్నారు. జిల్లా జాయింట్ కలక్టరు కెఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో బ్లూ ఫ్లాగ్ సర్టిపికేషన్ పొందిన ఒకే ఒక బీచ్ రుషికొండ బీచ్ అని అన్నారు. బ్లూ ఫ్లాగ్ ఇండియా వారి 33పారామీటర్స్ ను పొందిన బీచ్ లకు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందని, మన రాష్ట్రంలో రుషికొండ బీచ్ సాధించిదన్నారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్నిరకాల చర్యలు చేపట్టామన్నారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరింగిదన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం రీజనల్ డైరెక్టరు శ్రీనివాస్, సమాచార శాఖ జాయింట్ డైరెక్టరు వి.మణిరామ్ తదితరులు పాల్గోన్నారు.

విద్యార్థులు సామాజిక చైతన్యంపై దృష్టిని పెట్టాలి

విశాలాంధ్ర - మల్కాపురం : విద్యార్థులు సామాజిక చైతన్య విషయాలపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా కళారూపాలుగా వాటిని తయారు చేసి ప్రదర్శించాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మల్కాపురంలోని పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో ఆమె మాట్లాడుతూ- స్వచ్ఛభారత్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు,మంచి అలవాట్లు, ఆరోగ్యవంతమైన జీవన విధానం, అక్షరాస్యత ఆవశ్యకత మొదలైన అనేక అంశాలపై చిన్నారులు అవగాహన కలిగించాలని అన్నారు. ఈ అవగాహన చిన్న చిన్న నాటికల రూపంలో కలిగిస్తే మంచిదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మరియు ఆరోగ్య జీవన విధానంపై కొన్ని నాటికలను విద్యార్థులు ప్రదర్శించారు. సమావేశానికి ప్రముఖ కవి కె. సత్తిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు దేవాలయానికి, క్రైస్తవులు చర్చికి, ముస్లింలు మసీదుకు వెళతారనీ, కానీ అందరూ కులమతాలకు అతీతంగా వెళ్లే ఆలయమే గ్రంథాలయమని, అందుకే విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి అనేక విషయాలు తెలుసుకోవాలని ఆయన అన్నారు. సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రముఖ పాత్రికేయులు మనోహర్ మాట్లాడుతూ- చిన్నారులు జంక్ ఫుడ్ తినకుండా, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అన్నారు. మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందనీ, ఆరోగ్యవంతమైన పౌరులే ఆరోగ్యవంత సమాజాన్ని సృష్టించగలరని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలో ఆయన విద్యార్థులకు ఉదాహరణలతో సహా వివరించారు. సమావేశాన్ని గ్రంథాలయాధికారి వి. అజయ్ కుమార్ సమన్వయ పరిచారు. యథావిధిగా విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ శ్రీమతి కొణతాల సుధ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సమావేశంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటపాటలతో, కథలు, కదానికలతో, నాటికలతో , చిన్నచిన్న బొమ్మలను తయారు చేయడం నేర్చుకోవడంతో వుత్సాహంగా గడిపారు. దాదాపుగా 40 మంది చిన్నారులు ఈ శిబిరంలో పాల్గొన్నారు.

బీజేపీ పతనానికి రోజులు దగ్గర పడ్డాయి

విశాలాంధ్ర - కూర్మన్న పాలెం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద 821 వ రోజు జరుగుతున్న రిలే నిరాహారదీక్ష శిబిరంలో ఎఫ్.ఎం.డి, ఆర్.ఆర్ అండ్ ఆర్ ఆర్ మరియు సీ. ఎం డి విభాగాల ప్రతినిధులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, పోరాట కమిటీ నాయకులు ఎన్ రామారావు, సిహెచ్ సన్యాసిరావు, గుమ్మడి నరేంద్ర, దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నేడు కర్ణాటక రాష్ట్రంలో ప్రజలు తమ వ్యతిరేకతను తెలియజేశారని వారు అన్నారు. దక్షిణ భారతంలోనే బిజెపి ప్రభుత్వానికి మద్దతిస్తున్న ఏకైక రాష్ట్రమైన కర్ణాటకలో కూడా బిజెపి తన అధికారాన్ని కోల్పోయిందని ఇది శుభ పరిణామాన్ని వారు వివరించారు. దేశంలో జరిగే మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకించడం ద్వారా, ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకోవడం ద్వారానే ప్రజలకు తమ జీవనోపాధి పెరుగుతుందని వారు స్పష్టం చేశారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించడం ద్వారా ప్రజలలో ఐక్య ఉద్యమాల పట్ల కలుగుతున్న ఆదరణను తగ్గించడం కోసం బిజెపి వ్యవహరిస్తోందని వారు తీవ్రంగా విమర్శించారు. కనుక ఈ పరిణామాలు దేశవ్యాప్తంగా ఈ పరిణామాలను ప్రజలకు వివరించి ఈ ఉద్యమాలను దేశవ్యాప్త ఉద్యమాలుగా నిర్మించడం మనందరి కర్తవ్యం అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో FMD, RS&RS, CME విభాగాల ప్రతినిధులు సిహెచ్ వెంకట్రావు, బీఎస్ చలపతిరావు, మధు, బాలకృష్ణ, యు వెంకటేశ్వర్లు, బి ఎల్లాజీ, కె రాజు, వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, కె బాలశౌరి, వి ప్రసాద్, వీజీకే.రాజు మహిళలు కె.వేణు, యు శేషమ్మ, పద్మ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

గుడ్డు టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన

విశాలాంధ్ర - నర్సీపట్నం : వేసవి శిక్షణ తరగతులలో భాగంగా నర్సీపట్నం గ్రంథాలయంలో శనివారం చిన్నారులకు ప్రత్యేకంగా గుడ్ టచ్, బాడ్ టచ్ అంశాలపై పిల్లలకు స్థానిక సచివాలయం ఉమెన్ ప్రొటెక్షన్ అధికారి భవాని వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు నుండి బహు మతులు స్వీఖరించారాదని చెప్పారు. పి.వి . కనకరాజు మాస్టర్ హాజరై ఇంగ్లీష్ రైమ్స్ చెప్పి అనుగుణంగా యాక్షన్ చేయించారు. ఏ. వరాహలా బాబు, తురకబడి, క్రాఫ్ట్ టీచర్ పిల్లలతో కాగితం పువ్వులు ఎలా చేయాలో నేర్పించారు. అందరూ శ్రద్ధగా చేయునట్లు చూసారు. గ్రంథాలయధికారిని పి . దమయంతి పర్యవేక్షణ లో కార్యక్రమం జరగగా 43 మంది పిల్లలు పాల్గొన్నారు.

లారీ క్లీనర్ అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర - పరవాడ : ఓ లారీ క్లీనర్ అదృశ్యమైన సంఘటనపై పరవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చీరాలలోని ప్రసాద్ నగర్ కు చెందిన ఎం.విజయ్ కుమార్(38) ఏపీ0హెచ్ 7887నెంబర్ గల లారీలో డ్రైవర్ శాంత రాజు వద్ద క్లీనర్ గా పని చేస్తున్నాడు. ఈ నెల 6న ఉదయం వీరిద్దరూ గుంటూరు జిల్లా నరసారావుపేట నుంచి గేదెల దాణా లోడుతో సబ్బవరం దరి ఆనందపురం వచ్చి 8న అన్ లోడ్ చేసారు. తిరిగి అదేరోజు సాయంత్రం లోడ్ కోసం లంకెలపాలెం సంతోష్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసుకు వచ్చారు. లోడ్ రెడీగా లేనందున రాత్రికి అక్కడే ఉండిపోయారు. మరుసటి రోజూ లోడ్ సెట్టవక పోవడంతో ఆ రోజు కూడా అక్కడే ఉండిపోయారు. రాత్రికి డ్రైవర్ ఆఫీస్ లో పడుకోగా క్లీనర్ లారీలో పడుకున్నాడు. 10న ఉదయం డ్రైవర్ లేచి చూసే సరికి క్లీనర్ విజయ్ కుమార్ కనిపించలేదు. చుట్టు పక్కల ఆరా తీసినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం డ్రైవర్ శాంత రాజు పరవాడ పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేశారు. క్లీనర్ ఆచూకీ తెలిసినవారు 9440796038, 8374795128 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కర్నాటక ఫలితాలపై కాంగ్రెస్ సంబరాలు

విశాలాంధ్ర - పెందుర్తి : కర్నాటకలో ప్రజాస్వామ్యం విజయం సాదించిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి షేక్ షఫీఉల్లా, పెందుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జ్ ఆడారి రమేశ్ నాయుడు తదితరులు అన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాదించి 224కు136 స్థానాల్లో జయకేతనం ఎగురవేయడంతో పెందుర్తిలో ఆ పార్టీ నాయుకులు సంబరాలు చేసుకున్నారు. కేకు కత్తిరించి ఒకరికొకరు తినిపించుకున్నారు. బాణాసంచా కాల్చి సందడి చేసారు. ఈ సందర్భంగా షఫీ మాట్లాడుతూ కర్నాటక ఫలితాలు దేశవ్యాప్తంగా రానున్నాయని ధీమా వ్యక్తం చేసారు. ఏపీలోను మంచిఫలితాలు వస్తాయన్నారు. రాహుల్, ప్రియాంక గాంధీల పాలనను దేశ ప్రజలు కోరుతున్నారని వెల్లడించారు.

అఖిలభారత ఆదివాసి సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర/మారేడుమిల్లి : ఈనెల 21వ తేదీన విశాఖలో జరుగు అఖిలభారత ఆదివాసి సదస్సును జయప్రదం చేయాలని మారేడుమిల్లి ఏఐకేఎంఎస్ ప్రదర్శన నిర్వహించారు. మారేడుమిల్లి లో శనివారం జరిగిన సంతలో ఆదివాసీల రక్షణకై పర్యావరణ జీవావరణాల పరిరక్షణకై జరుగుతున్న అఖిలభారత ఆదివాసి సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మారేడుమిల్లి లొ సంత మార్కెట్ వరకు ప్రదర్శన నిర్వహించి ప్రచారం చేయడం జరిగింది. సంతలో తిరుగుతూ కరపత్రాల పంచుతూ గిరిజన ప్రజలను చైతన్యవంతులు చేస్తూ నినాదాలు చేస్తూ ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముద్రించిన కరపత్రాన్ని గిరిజనులకు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు గెద్దాడ సూరిబాబు, బిర్ల సురేష్, కే.బాబురావు, కర్నాకుల రామ లింగేశ్వరరావు, పాలెపు రామారావు దొర తదితరులు ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

'రూప' కుటుంబాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర - ఎటపాక : ఎటపాక మండలం గౌరీదేవిపేట గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లేని ఓ పేద అనాథ విద్యార్థిని తెల్లం రూప పడుతున్న ఆర్థిక ఇబ్బందిని గమనించి పదవ తరగతి సప్లమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించి, పరీక్ష రాసేందుకు చింతూరు వెళ్లి రావడానికి, భోజనానికి అయ్యే ఖర్చులన్నీ తానే స్వంతంగా చెల్లించేందుకు నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, పల్లె జ్యోతి దినపత్రిక రిపోర్టర్ బుడిపిటి నాగార్జున మండలంలో ముందుకొచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. దీంతో అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలకు తమ వంతు సాయం చేయాలన్న ఆలోచన, దయా హృదయంతో తెలంగాణా ఇరిగేషన్ శాఖ డిఈ బయ్యని కోటేశ్వరరావు సైతం శనివారం రూ.2 వేలు అందించడంతో ఆ మొత్తాన్ని రిపోర్టర్ నాగార్జున గౌరీదేవిపేట సర్పంచ్ ఉలవల శివకనకరాజు చేతుల మీదుగా అనాథ పిల్లలకు అందజేశారు. అనంతరం నాగర్జున మాట్లాడుతూ పేద విద్యార్థిని తెల్లం రూప కుటుంబానికి దాతలు సాయం చేసేందుకు ముందుకు వచ్చి ఆదుకోవాలని రిపోర్టర్ బుడిపిటి నాగార్జున కోరారు.

గెడ్డలో మహిళ మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - ముంచింగి పుట్టు : మండలంలో గల సుజనకోట పంచాయతీ కేంద్రంలో గల మత్స్యగెడ్డలో శనివారం ఉదయం గెడ్డలు మహిళా మృతదేహం కనిపిస్తూ ఉండడంతో స్థానిక యువకులు కొంత మంది పోలీస్ స్టేషన్ సమాచారం అందించడంతో వెంటనే స్థానిక ఎస్సై కే.రవీంద్ర తన సిబ్బందితో హుటాహుటిన సుజన కోట మత్స్య గెడ్డ లో చేరుకొని మృతదేహాన్ని పరిశీలన చేసి విచారణ చేయగా మండిభ గ్రామానికి చెందిన సుంక్రి హేమ (50) మృతదేహంగా గుర్తించారు. అయితే విషయం తెలుసుకున్న మృతురాలి కుమారుడు సుంక్రీ. ప్రసాద్ మా తల్లికు గత కొద్ది రోజులుగా మతిస్థిమితం లేకపోవడంతో 12వ తేదీ ఉదయం ఎనిమిదిన్నర గంటలకు ఇంటి నుండి బయలుదేరి వెళ్లిందని సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో తమ కుటుంబ సభ్యులను బంధుమిత్రులను ఆరా తీశామని అయితే శనివారం ఉదయం సుజన కోట మత్స్యగెడ్డ లో మహిళా మృతదేహం కనిపించినట్లు సమాచారం తెలుసుకొని మృతదేహాన్ని పరిశీలించగా తన తల్లి మృతదేహంగ గుర్తించమని తన తల్లి కొద్ది రోజులుగా మతిస్థిమితం లేకపోవడంతోనే మత్స్య గెడ్డలోపడి మృతి చెందిందని తన తల్లి మరణానికి ఎవరి మీద మాకు ఎటువంటి అనుమానం లేనట్లుగా పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు సుంక్రి ప్రసాద్ తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1244 కేసుల పరిష్కారం

విశాలాంధ్ర - యలమంచిలి : శనివారం స్థానిక కోర్ట్ సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 1244 కేసులు పరిష్కరించినట్లు యలమంచిలి మండల న్యాయ సేవాధికార సంస్థ అధికారి, సీనియర్ సివిల్ జడ్జి ఎ. సాయికుమారి, అడిషినల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఇంఛార్జ్ అధికారి బి.వి.విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 1244 కేసులు పరిష్కరించామని దీనిలో భాగంగానే రాజీ పరిష్కార నిమిత్తం రూ.93,90,003/-లను కక్షిదారులకు చెల్లించినట్లు తెలియజేశారు. రాంబిల్లి మండలం రాజ కోడూరుకి చెందిన ఎమ్. పెరయ్య అను వ్యక్తి తన భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం నిమిత్తం 2019 లో కోర్టులో దరఖాస్తు చేసుకోగా దానిపై రెవెన్యూ అధికారులు సర్వే చేసి కొత్త పాసుపుస్తకంను కోర్టు వారి సమక్షంలో ఈ జాతీయ లోక్ అదాలత్ లో జారీ చేయడం జరిగిందన్నారు.

మన్యంలో సుకుమార్ చిత్ర బృందం

ఏజెన్సీలో శరవేగంగా పుష్పా 2 చిత్రీకరణ

విశాలాంధ్ర - చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో పుష్ప 2 షూటింగ్ జరుగుతుంది. పుష్పా సినిమాకి దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్ చూసి అంతా నివ్వెర పోయారు. ఇప్పుడు పుష్పా2 పై భారీ అంచనాలు పెట్టుకున్నారు. సినిమా కూడా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో సుకుమార్ చాలా జాగ్రత్తగా షూటింగ్ విషయంలో కంగారు పడకుండగా చిత్రీకరణ చేద్దాం అనే ఆలోచనలో ఉన్నారు. ఈ క్రమంలో పది, పది రోజుల షెడ్యూల్ పెట్టుకున్నారు.తాజాగా మైత్రి మూవీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న పుష్పా2 చిత్రంలోని సన్నివేశాల్లో భాగంగా సుకుమార్ అతని చిత్ర బృందం సభ్యులు ఏజెన్సీలో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల గల సీలేరు నది అవతల చిత్రీకరణ ప్రారంభించారు. మలయాళ నటుడు ఫహద్ ఫజిల్ పై మూడు రోజులు కొన్ని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. అనంతరం ఫోర్ బై జలాశయం ఎగువన దట్టమైన అభయారణ్యంలోని కొన్ని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నామని పుష్ప చిత్ర బృందం తెలిపింది.

మాతృమూర్తులను పూజించు

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ నేడు మదర్స్ డే సదర్భంగా, 92 వ వార్డు నందు గల పద్మనాభ నగర్ గ్రామానికి చెందిన నందవరపు సోములు. స్థానిక మహిళలకు వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. పిదప ఆయన మాట్లాడుతూ మాతృ మాల సేవా సంస్థ ద్వారా మాతృమూర్తులను పూజించు విస్తృత కార్యక్రమాలలో పాల్గొని, నేటి యువతకు తల్లి యొక్క విశిష్టతను తెలియజేయు అనేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యంగా అనేక ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులలో అవగాహన కల్పించడంతో పాటు, తల్లులను పూజించడం వారికి పాదాభివందనం చేయించడం మొదలగు కార్యక్రమాలు చేస్తున్నారు.. అనేక పాఠశాలలో 'అమ్మ' పై విద్యార్థులకు వ్యాసరచనలు నిర్వహించి వారికి బహుమతులను అందజేయడం జరుగుతుంది. సోములు గత 20 సంవత్సరములుగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు మాతృ మాల సేవా సంస్థ వారు నందవరపు సోములు కు వెండికంకణం తొడిగి "మాతృ రత్న" పురస్కారంతో ఘనంగా సత్కరించరి.

సింహగిరిపై పేరుకే ఫిర్యాదుల పుస్తకం...!

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి ఆలయం భక్త జన సంద్రంలో మునిగి తేలింది. భీమిలి ఎమ్మెల్యే అవంతి, జీవీఎంసీ డిప్యూటి మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు తదితరులు దర్శించుకున్నారు. సింహాద్రి భక్తులతో కిట కిట జాతర తలపించింది. అప్పన్న స్వామి భక్తుల బాధలు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. శని, ఆదివారాల్లో ఆగర్ బత్తి, కొబ్బరికాయలు, లగేజీ బధ్ర పరిచే గుత్తే దారులు భక్తుల జేబులకు చిల్లులు పడేలా చేస్తున్నారు. పేరుకే ప్రతి శనివారం, ఆదివారం లేజేస్ సిబ్బంది తనిఖీలు చేపడతారు. నిజంగా సంబంధిత అధికారులు గుత్తేదారులపై అపరాధ రుసుం వసూలు చేయటం జరుగతుంది. అయినా కొండలపైన ఉన (మే ఐ హెల్ప్ యు) మి సహాయం కొరకు ఉన్న కార్యాలయంలో ఫిర్యాదుల పుస్తకంలో ఫిర్యాదులు కో కోల్లలు. అసలు ఏ అదికారైనా ఏనాడైనా భక్తుల సౌకర్యార్థం కోసం ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పుస్తకం పరిశీలించరా? . ప్రముఖులు, సెలబ్రిటీలు, ఉన్నతాధికారుల దర్శనాలు, ప్రసన్నాల తోనే సమయం కాస్త అయిపోతుంది. ఇక భక్తుల బాధలు ఎవరు పట్టించు కుంటారు. ఉత్సవాల సమయంలో భక్తులకు అన్ని, ఇన్ని సౌకర్యాలు చేస్తున్నా మని టివిల్లో, పత్రికల్లో ఊక దంపుడు ప్రచారం చేస్తున్నారని భక్తులు, స్థానికులు అంటున్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ గొలగాని, ఎమ్మెల్యే వాసుపల్లి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : దక్షిణ నియోజకవర్గంలో 34, 38వ వార్డుల పరిధిలోని బుక్కా వీధి, మాత వెంకటప్పయ్య వీధి, భూపేష్ నగర్ తదితర ప్రాంతాలలో రూ.75 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, కార్పొరేటర్లు గోదు విజయలక్ష్మి, తోట పద్మావతితో కలసి మేయర్ హరి వెంకట కుమారి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. 34, 38వ వార్డుల పరిధిలో ఇప్పటికే పలు సంక్షేమ కార్యక్రమాలు తోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, తాజాగా 75 లక్షల రూపాయలతో ఈ వార్డులలో అభివృద్ధి పనులు చేసేందుకు శంకుస్థాపన చేశామన్నారు. ఇప్పటికే బీచ్ రోడ్లు తదితర ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చేశామని, అలాగే గ్రేటర్ విశాఖపట్నం పరిధిలో అన్ని వార్డులను అభివృద్ధి పరుస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకునేందుకు జగనన్నకు చెబుదాం అనే వినూతన కార్యక్రమాన్ని చేపట్టారని తద్వారా ప్రజల సమస్యలను ఆయన నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, సహాయక ఇంజనీర్, సచివాలయ సెక్రటరీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం పట్ల హర్షం

విశాలాంధ్ర - పాయకరావుపేట : కర్ణాటక రాష్ట్రంలో 224 అసెంబ్లీ స్థానాలకు గాను అత్యధిక అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం పట్ల పిసిసి డెలిగెట్ జగతా శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేశారు. జగతా శ్రీనివాస్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం బిజెపి పతనానికి నాంది పలుకుతుందని తెలిపారు. ఏఐసీసీ ఉపనేత రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్ర ప్రజల స్వాగతించారని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలే కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలో కూర్చో పెడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మోర్త సింహాచలం, పట్టణ అధ్యక్షులు పోలవరపు అప్పలరాజు, కర్రి సత్యనారాయణ, రాజు, సతీష్, కుమార్, జనక తదితరులు పాల్గొన్నారు.

గయి నేహా...ద్వితీయ వర్ధంతి సందర్భంగా భోజనం ఏర్పాటు

విశాలాంధ్ర - కొమ్మాది : మధురవాడ ప్రాంతానికి చెందిన అచ్చుమాంబ కన్స్ట్రక్షన్స్ అధినేత అల్లాడ వెంకట్రావు, మంగామ్మ దంపతుల కుమార్తె నేహా ద్వితీయ వర్ధంతి సందర్భంగా మధురవాడ అమ్మఒడి బాలల సంరక్షణ కేంద్రంలోని పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పి.ఎం పాలెం లా అండ్ ఆర్డర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై రామకృష్ణ పాల్గొని పిల్లలకు భోజనాలను వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలతో మాట్లాడుతూ పిల్లలు చక్కగా చదువుకొని మంచి భవిష్యత్తును పొందాలని ఆశించారు. ముందుగా గయి నేహా. ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి, భగవంతుని ప్రార్థించారు.కార్యక్రమంలో శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ వంకాయ మారుతీ ప్రసాద్, బంగారు అశోక్ కుమార్, హాండ్స్ టూ హెల్ప్ చిన్ని వెంకట్ పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

విశాలాంధ్ర - కే కోటపాడు : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని దశలవారీగా కుదిస్తూ నిర్వీర్యం చేయటానికి కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు అన్నారు. శనివారం చౌడువాడ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజుకు 400 రూపాయలు కూలి చెల్లించాలని , ఒక్కో కుటుంబానికి రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలన్నారు. 2014 మోడీ ప్రభుత్వం రాకముందు జాతీయ ఉపాధి హామీ పథకం బడ్జెట్లో 1,20,000 కోట్ల రూపాయల కేటాయించగా 2023 వచ్చేసరికి 60 వేల కోట్ల రూపాయలు కుదించిందని అన్నారు. కూలీలకు వేసవిలో అలవెన్సులు, గుణపాము, గడ్డపార, తట్టలకు డబ్బులు అందించాలని ఉపాధి పథకం చట్టంలో పొందుపరిచి నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదు అన్నారు. ప్రతి 15 రోజులకోసారి పేమెంట్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు వనము సూర్యనారాయణ ఉపాధి మెట్ల కూలీలు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, Nikita Kumari Jain (Old Name) W/o. Pritam Kumar Jain Residing at 27-4-55/19, Flat No. 404, 4th Floor, Arihant Towers, Poorna Market, Visakhapatnam-530002. I changed my name to NIKITA JAIN (New Name) Hence forth I will be known as NIKITA JAIN

గిరిజన సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

మండల అధ్యక్ష కార్యదర్శులుగా బేరా రామకృష్ణ పడాల్, సాగిన చిరంజీవి పడాల్

విశాలాంధ్ర - చింతపల్లి : గిరిజన సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ధనుంజయ్ సమక్షంలో మండల మహాసభ నిర్వ హించారు. ఈ మహాసభలో మండలంలోని ప్రధాన సమస్యలైన హైడ్రో పవర్ ప్రాజెక్ట్, బోయ వాల్మీకులు, బెంతు ఒరియాలను గిరిజన జాబితాలో చేర్చటం, జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేయాలని, గిరిజన చట్టాలు అమలు, మారుమూల ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పన పూర్తిస్థాయిలో జరగడంలేదని ఆ సమస్యలపై భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించాలనే అంశాలను మహాసభలో చర్చించిన అనంతరం గిరిజన సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఇందులో మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బేరా రామకృష్ణ పడాల్, కార్యదర్శిగా సాగిన చిరంజీవి పడాల్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారితోపాటు కార్యదర్శి వర్గంగా మజ్జి రాంబాబు, కిలో సింహాచలం, గూడెపు రాజు, గూడెపు చినరాజు పడాల్, కొర్ర డేవిడ్, పాంగి సాము బాబు లతో పాటు 20 మందితో కూడిన మండల కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ పడాల్, చిరంజీవి పడాల్ లు మాట్లాడుతూ గిరిజన చట్టాలు హక్కులకు నష్టం వాటిల్లే విధంగా ఏ పార్టీలు, ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకున్నా గిరిజనుల పక్షాన నిలిచి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులను కాపాడుకుంటామని, హైడ్రో పవర్ ప్రాజెక్టుపై అలుపెరుగని పోరాటం చేస్తామని అదే క్రమంలో బోయ వాల్మీకులు, బెంతు ఒరియాలను గిరిజన జాబితాలో చేర్చేందుకు శాసనసభ సాక్షిగా చేసిన తీర్మానాలను వైకాపా ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

అక్రిడేషన్ల జీవో 38ను సవరించాలి

- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలి
- లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మీడియా అక్రిడేషన్ ల జీవో నెం 38ను తక్షణమే సవరించాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్(ఎల్ ఎన్ ఏ) నేతలు డిమాండ్ చేశారు. పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జీవో లో ఉన్న పలు అంశాలపై ప్రతినిధులు చర్చిచారు. ఐటీ రిటర్న్ లు జత చేయాలనే నిబంధనను తొలగించాలని కోరారు. స్థానిక దినపత్రికలకు గతంలో మాదిరిగా ప్రచురణ కేంద్రంతోపాటు నియోజకవర్గాల వారీగా, ఇతర జిల్లాల్లోనూ అక్రిడేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిరియాడికల్స్ కు కనీసంగా రెండు అక్రిడేషనలు ఇవ్వాలని, స్టేట్ బస్సు పాస్ జారీ చేయాలని కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు వచ్చే విధంగా జీవోను మార్పు చేయాలని , ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 300 చదరపు గజాల చొప్పున జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ,స్థానిక పత్రికలకు తగినన్ని యాడ్స్ ఇవ్వాలని, ఉచితంగా హెల్త్ కార్డులు పంపిణీ, కోవిడ్ తో మృతి చెందిన జర్నలిస్టులకు గతంలో విడుదల చేసిన జీవో ప్రకారం ఐదు లక్షలు పరిహారం చెల్లింపు తదితర డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని సమావేశం తీర్మానించిందని నేతలు తెలియజేశారు.

అక్రిడేషన్ విశాఖ జిల్లా కమిటీ సభ్యుడు నిట్టల శ్రీనివాస్ సన్మానం

స్థానిక పత్రికల నుండి విశాఖపట్నం జిల్లా మీడియా అక్రిడేషన్ల కమిటీలో సభ్యునిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిట్టల శ్రీనివాస్‌ను ఈ సమావేశంలో ఘనంగా సత్కరించి అభినందించారు. జర్నలిస్టుల అక్రిడేషన్ల సమస్యను పరిష్కారానికి తగిన కృషి చేయాలని కోరారు. ఈనెల 15న జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో అక్రిడేషన్ల సమస్యపై వినతి పత్రాలు అందజేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సర్వసభ్య సమావేశంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యనారాయణ కార్యదర్శి ధవలేశ్వరపు రవికుమార్, ఉపాధ్యక్షుడు బి.నారాయణ రావు, కోశాధికారి అర్.అబ్బాస్, బి రవికాంత్, హరనాథ్, కే.చక్రవర్తి, జి.ఆనంద్, బి.శివ ప్రసాద్, వెంకట వేణు , మహేష్, పితాని ప్రసాద్, నరేంద్ర, కుమార్,శ్రీహరి, కమల్ కుమార్, కేకే రెడ్డి,హేమసుందర్, భగవాన్, నరసింహం, రవికుమార్, గణేష్, కీర్తన, బి.ఏ.నాయుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అమర్నాథ్ కుటుంబమే అసలైన జెండా కూలీలు

బిజనసేన అధికార ప్రతినిధి దూలం గోపి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రంలో భవిష్యత్తు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పొత్తులు పై మాట్లాడిన వెంటనే మంత్రి అమర్నాథ్, పవన్ కళ్యాణ్ పై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన పార్టీ అధికార ప్రతినిధి దూలం గోపి అన్నారు. ప్రజా సమస్యల పై కానీ తన మంత్రిత్వ శాఖ పై ఏనాడూ స్పందిస్తూ పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి మాట్లాడని మంత్రి అమర్నాథ్ జగన్ మోహన్ రెడ్డి దగ్గర ప్రాపకం కోసం జనసేన పై విమర్శలు చేసేందుకు సిద్ధంగా ఉంటా రన్నారు. అయన నిన్న మాట్లాడుతూ. జనసేన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి కూలీలు అని మాట్లాడారు. మరి ఆ విషయానికి వస్తే గుడివాడ గురునాథ్ రావు ఉన్నపుడు కాంగ్రెస్ లో ఆయన

తదనంతరం తెలుగుదేశం లో 2014 ఎన్నికలకు ముందు వైసీపీ లో చేరిన జెండా కూలి కుటుంబం మీది కదా..? అసలైన జెండా కూలి కుటుంబ మీదే, ఈ రాష్ట్రం లో జరుగుతున్నా రాక్షస పాలన అంతం చేయాలనీ టీడీపీ - జనసేన - బీజేపీ కూటమితో ఎన్నికలకు వెళ్తాను అంటే ఎందుకు ఉల్లికి పడుతున్నారు. అని ప్రశ్నించారు. 175/175 గెలిచేస్తాం అని మీ అధికనాయకుడు చెప్పిన మాట మీద మీకు నమ్మకం ఉంటే ఎందుకు కంగారు పడుతున్నారు, జగన్ మోహన్ రెడ్డి పాలనలో 4 సమస్యల ఉంటే చూపించాలని మంత్రి అమర్ అడుగుతున్నా రని 4 సమస్యలు కాదు 400 సమస్యలు చూపిస్తాం జనసేన పార్టీగా మీరూ సిద్దమేనా... అని సవాల్ విసిరారు. రాష్ట్రం వరకు అవసరం లేదు అనకాపల్లి వేదికగా వున్నా వైసీపీ వైఫొల్యలు కూడా 40 కి పైగా చెప్తాం మరి చర్చకు సిద్ధమేనా, జనసైనికులకు, నాయకులు ఉచిత సలహాలు ఇస్తున్న మంత్రి అమర్నాథ్ ముందు తన సంగతి ఏంటో చూసుకోవాలి, వచ్చే ఎన్నికల్లో కనీసం అనకాపల్లి లో కాదు జిల్లాలో ఎక్కడ గెలిచే పరిస్థితి లేదు కాబట్టి ఇతర పార్టీలకు నీతులు, సుద్దులు చెప్పడం మానుకోవాలి, మాట్లాడితే పవన్ కళ్యాణ్ పెళ్లిళ్ల కోసం మాత్రమే మాట్లాడే వైసీపీ నాయకులు అది తప్ప జనసేనాని ని విమర్శించేందుకు ఇంకో అంశం లేదు. ఈ స్క్రిప్ట్ 2019 ఎన్నికల్లో ఈ మాట ప్రజలు నమ్మరు కానీ ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో ప్రజలు ఆ మాటలు విశ్వశించారు. మంత్రి అమర్నాథ్ మాటలు అదుపులో పెట్టుకుంటే మంచిది, కచ్చితంగా రాబోయే ఎన్నికల్లో వైసీపీ ని గద్దె దించుతామని అన్నారు.

ఫ్యాషన్ డెస్టినేషన్‌గా అచ్యుతాపురంలో ట్రెండ్స్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ : భారతదేశంలో అతిపెద్ద వేగంగా అభివృద్ధి చెందుతున్న దుస్తులు మరియు ఉపకరణాల స్పెషాలిటీ గొలుసు రిలయన్స్ రిటైల్, ట్రెండ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం పట్టణంలో తన కొత్త స్టోర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ పట్టణంలోని కస్టమర్‌లు అత్యాధునికమైన మహిళల దుస్తులు, పురుషుల దుస్తులు, కిడ్స్ వేర్ ఫ్యాషన్ ఉపకరణాలు, ఆనందకరమైన ధరలకు షాపింగ్ చేసే ప్రత్యేకమైన మరియు అద్భుతమైన అనుభవం కోసం ఎదురుచూడవచ్చునని స్టోర్ ప్రతినిధులు చెప్పారు. అచ్యుతపురం పట్టణంలో మొదటి ట్రెండ్స్ స్టోర్ అయిన ఈ 6512 చ.అడుగుల దుకాణం దాని వినియోగదారుల కోసం ప్రత్యేక ప్రారంభ ఆఫర్‌ను కలిగి ఉంది. రూ.3999కి షాపింగ్ కి రూ.249 వద్ద, రూ.3999 కొనుగోలుపై రూ.2000 విలువైన కూపన్‌ను పూర్తిగా ఉచితంగా పొందుతారనీ ఈ అవకాశం వినియోగించాల్సిందిగా వారు కోరారు.

నేరాల నియంత్రణకు సహకరించండి

ఆటో కార్మికులతో డీసీపీ నాగన్న

విశాలాంధ్ర - విశాఖ : నేరాల నియంత్రణలో ఆటో కార్మిక సంఘాలు, ఆటో డ్రైవర్లు భాగస్వాములు కావాలని క్రైమ్, ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గంధం నాగన్న అన్నారు. విశాఖ పోలీస్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో, ఆటో డ్రైవర్లతో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణలో పౌరులుగా ఆటో డ్రైవర్ల బాధ్యత ఎంతో ఉందని అన్నారు. నగరంలో పెరిగిపోతున్న మాదక ద్రవ్యాలను అరికట్టడంలో, అనుమానితులను గుర్తించడంలో ఆటో డ్రైవర్లు సహకారం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు ఎస్.కె రెహమాన్, పడాల గోవింద్, సిఐటియు నాయకులు సత్యనారాయణ, ఐఎన్‌టీయుసి నాయకులు కొండబాబు, సింహాద్రి, వెంకట్, ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులకు సాధికారత అందిస్తున్న ఎలక్ట్రోస్టీల్

విశాలాంధ్ర/విశాఖపట్నం : ఈ డైనమిక్ ప్రపంచంలో, సాంకేతిక పరిజ్ఞానంతో పరిచయం తప్పనిసరి నైపుణ్యంగా మారింది. గ్రామీణ భారతదేశంలో డిజిటల్ విద్యను ప్రోత్సహించే దృక్పథానికి అనుగుణంగా, భారతదేశంలోని డక్టైల్ ఐరన్ పైపులు, ఫిట్టింగ్‌ల తయారీలో అగ్రగామిగా ఉన్న ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ ఇటీవల తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద, ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి పరిసర గ్రామాల్లో ఉంటున్న విద్యార్థులకు సాధికారత కల్పించేందుకు కంప్యూటర్ అక్షరాస్యత శిక్షణను ప్రారంభించింది. సీఎస్ఎల్-శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా, తొండమనాడు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుండి 9 తరగతుల విద్యార్థులకు జూన్ 2022 నుండి ఏప్రిల్ 2023 వరకు సుమారు 140 మంది విద్యార్థులకు కంప్యూటర్ అక్షరాస్యత ప్రోగ్రామ్‌లను నిర్వహించింది. తిరుపతి జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఏడాది పొడవునా నిరంతర సీఎస్ఆర్ కార్యకలాపాలు నిర్వహించబడతాయి. అందులో భాగంగానే ఈ కార్యక్రమం జరిగింది.

వేసవి విజ్ఞాన శిబిరంను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం : వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాకవరపాలెం గ్రంథాలాయాధికారి చంద్రకళ అన్నారు. వేసవి విజ్ఞాన శిభిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు కథలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా వచ్చి ఈ విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాదీవెన స్టాక్ పాయింట్ సందర్శన

విశాలాంధ్ర - జికేవీధి : అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జికేవీధి మండలంలో జగనన్న విద్యాదీవెన స్టాక్ పాయింట్ అయిన కేజీబివిని శనివారం ఎంపిడిఓ ఉమామహేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను పరిశీలించారు. ఇప్పటికి పుస్తకాలు వచ్చాయని, ఇంకా జగనన్న విద్యాకానుకలో భాగంగా షూ, బెల్ట్, టై ఇంకా రావాల్సి ఉందన్నారు. అలాగే మండలంలో పాఠశాలల్లో జరుగుతున్న నాడు నేడు పనులను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుందన్నారు.

గాజువాక సమగ్రాభివృద్ధికి నిధులు : మేయర్ హరి వెంకట కుమారి

విశాలాంధ్ర - గాజువాక : గాజువాక సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి అభివృద్ధి పరుస్తున్నదని విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు . 72 వ వార్డు పరిధి పాత గాజువాక కూడలిలో నూతన బస్ షెల్టర్ నిర్మాణానికి రూ.37. 90 లక్షల రూపాయల నిధులతో నిర్మించ నున్న బస్ షెల్టర్ కు స్థానిక ఎం.ఎల్. ఏ తిప్ప ల నాగిరెడ్డి తో కలసి శంకుస్థాపన చేసారు.శనివారం ఉదయం జరిగిన శంకుస్థాపన కార్యక్రమం లో మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గాజువాక ప్రాంత అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న దని అన్నారు. బస్ షెల్టర్ ల నిర్మాణం తో పాటు మౌలిక సదుపాయాల కు పెద్ద పీట వేస్తున్నా మని అన్నారు.గాజువాక ఎం.ఎల్. ఏ తిప్ప ల నాగిరెడ్డి మాట్లాడుతూ లక్షలాది రూపాయల నిధులతో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి గాజువాక అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. 72 వ వార్డు కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ వార్డు ప్రజల సంక్షేమంతో పాటు వార్డు లోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు . ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్. ఇ, ఇ. ఇ, ఏ. ఇ తో పాటు వార్డు వై.సిపి ఇంఛార్జి సిరట్ల వాసు , సీపీఐ నాయకులు అప్పా రి విష్ణుమూర్తి , జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై డిగ్రీ కళాశాల గర్ల్స్ హాస్టల్‌లో కొనసాగుతుంది

విశాలాంధ్ర - వి.మాడుగుల : మండల కేంద్రమైన మాడుగులలో ఇప్పటివరకు జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న డిగ్రీ కళాశాల ను ఇకపై ఖాళీగా ఉన్న జిల్లా పరిషత్ గర్ల్స్ హాస్టల్ నందు కొనసాగించడం జరుగుతుందని మాడుగుల ఎంపీపీ వేమవరపు రామ ధర్మజా తెలిపారు. ఇంతవరకు ఇంటర్ జూనియర్ కళాశాలలో షిఫ్ట్ మాదిరిగా డిగ్రీ కళాశాలను కొనసాగించడం ఇబ్బందిగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో అయినా జిల్లా అధికారులతో మాట్లాడి ఖాళీగా ఉన్న గర్ల్స్ హాస్టల్ ను సిద్ధం చేసి అందులో డిగ్రీ కళాశాలను నడిపించడానికి అన్ని వసతులు ఏర్పాటు చేశారన్నారు. అలాగే డిగ్రీ కళాశాలకు ఐదు ఎకరాలు స్థలం మంజూరు చేయడం జరిగిందని ఇక్కడ నిర్మాణాలు పూర్తయ్యే వరకు గర్ల్స్ హాస్టల్ లోనే డిగ్రీ కళాశాలను కొనసాగించడం జరుగుతుందన్నారు .మంత్రి ముత్యాల నాయుడు నియోజకవర్గ కేంద్రమైన మాడుగులపై ప్రత్యేక దృష్టి పెట్టి పలు అభివృద్ధి కార్యక్రమాలకు 20 కోట్లు మంజూరు చేయడం జరిగిందని వీటితో ఇప్పటికే పనులు ప్రారంభించామని రామ ధర్మజ తెలిపారు.

శ్రీమన్నారాయణ అష్టాక్షరీ మహాయాగం

విశాలాంధ్ర - చోడవరం : శ్రీ వేద నారాయణ ఆశ్రమం ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి జూన్ ఒకటో తారీకు వరకు శ్రీమన్నారాయణ అష్టాక్షరీ మహాయాగంను నేపాల్ లోని ముక్తినాథ్ క్షేత్రంలో చోడవరం పట్టణంకు చెందిన శ్రీమాన్ సుదర్శనం సీతారామాచార్యులు వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు శనివారం వారు మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా సీతారామాచార్యులు మాట్లాడుతూ హిమాలయ పర్వతశ్రేణుల్లో నేపాల్ దేశంలో పవిత్ర గండకీ నదీ తీరాన సాలగ్రామ శిలలు లభ్యమయ్యే ప్రాంతంలో ముక్తీ నారాయణ క్షేత్రమైన ముక్తీనాథ్ లో అష్టాక్షరీ మహామంత్ర క్షేత్రంగా దివ్యదేశంగా స్వయం వ్యక్త క్షేత్రంగా విరాజిల్లుతున్న ముక్తి నారాయణ క్షేత్రంలో తపస్సు, జపం, అనుష్టానం, యజ్ఞం, భాగవత ప్రవచనం, అన్నదానం గండకీ నదీ స్నానం, పితృకార్యం విశేష ఫలితాలు కలిగింపజేస్తుందన్నారు. పురాణ ఇతిహాసాల ద్వారా తెలియజేయబడుతున్న గండకీ క్షేత్ర దర్శనం దుర్లభమైన ఈ రోజుల్లో నాలుగు రోజులు పాటు యాగం నిర్వహించుకునే భాగ్యాన్ని శ్రీ వేదనారాయణ ఆశ్రమానికి అనుగ్రహించిన ముక్తీ నారాయణునికి శతకోటి వందనాలు తెలిపారు. నేపాల్ లో శ్రీముఖి నారాయణ క్షేత్రంలో శ్రీ వేదనారాయణ ఆశ్రమం వ్యవస్థాపకులు స్థానిక కేశవస్వామి పాద సేవకులు ఆధ్వర్యంలో నిర్వహించు ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు, ఆసక్తి కలిగిన వారు స్వయంగా సంప్రదించవలెనని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్: 94946 72757 లో సంప్రదించ వచ్చునని తెలిపారు.

నగరాలు కులస్తులకు కళ్యాణ మండపం నిర్మాణానికి స్థలం కేటాయించాలి

విశలాంధ్ర - కొమ్మది : విశాఖపట్నం మధురవాడ క్రికెట్ స్టేడియం వద్ద వైఎస్ఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్రెడ్డి గారికి విశాఖపట్నం జిల్లా పరిధిలో నగరాలు కులస్తులు సుమారు రెండు లక్షల మంది ఉన్నారని మాకు ఎక్కడా వివాహాది శుభకార్యాలు చేయుటకు కళ్యాణ మండపాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం, కావున విశాఖపట్నం జివియంసి పరిధి మా కులానికి ఒక ఎకరా స్థలం కేటాయించాలని భీమిలి శాసన సభ్యులు శ్రీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు గారి సమక్షంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు పిళ్లా సూరిబాబు తదితరులు ముఖ్యమంత్రి గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్రెడ్డి గారు సానుకూలంగా స్పందించారు.

గాయత్రి విద్యాపరిషత్ ఆధ్వర్యంలో కార్డియాలిజీ (గుండె) వైద్యంపై ఒక్క రోజు సదస్సు

విశాలాంధ్ర - మధురవాడ : కార్డియాలజీ (గుండె) సంబంధ వైద్యం లో తాజాగా చోటుచేసుకుం టున్న ఆధునిక విధానాలపై తమ గాయత్రి విధ్యాపరిషత్ నిర్వ హిస్తున్న ఒక్కోరోజు సదస్సు ఆ రంగ వైద్యులకు, వైద్య విధ్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందనే ఆశాభావాన్ని సదస్సు ప్రారంభకు లు వ్యక్తం చేసారు. శనివారం గాయత్రి విధ్యాపరిషత్ సాధారణ వైద్య,ఆరోగ్య రక్షణ, వైద్య సాంకేతికత విద్యాసంస్థ ఆధ్వర్యంలో, ఏపీఐ విశాఖ, ఆంధ్రావైద్య కళాశాల మెడిసిన్ విభాగం సౌజన్యంతో గాయత్రి వైద్యకళాశాల సుశృత సమావేశ భవనంలో ప్రారంభించిన ఒక్కరోజు సదస్సును శనివారం ఆ విద్యా పరిషత్ అధ్యక్షులు ఆచార్య. డా.పి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఆచార్య వి.సోమరాజు, వైద్య కళాశాల డీన్.ఆచార్య.యన్.సుబ్బారావు, ఆంధ్రామెడికల్ కళాశాల ప్రిన్సిపల్. ఆచార్య జి.బుచ్చిరాజులు జ్యోతి ప్రజ్వలన, ప్రారంభోపన్యాసం చేసారు. అనంతరం నగరంలోని ప్రముఖ కార్డియాలజీ వైద్యులు సీవీ.రావు (కేర్), నడిచే బరుహ(అపోలో), సుజాత (ఇన్డూస్), అనీల్మహాపాత్ర (ఇన్డూస్), వెంకటాచలం (ప్రిన్సిపల్. ప్రభుత్వ వైద్య కళాశాల. శ్రీకాకుళం) తమ వైద్యప సాంకేతిక,తదితర అంశాలపై వైజానిక ప్రశంగాల లో కార్డియాలజీ వైద్యంలో చోటు చేసుకున్న అంశాలను వివరించారు. ఈ ఒక రోజు కార్యక్రమంలో 200 మందికి పైగా వైద్యులు , పోస్ట్ గ్రాడ్యుయేట్, విద్యార్థులు విశాఖ,విజయనగరం,శ్రీకాకుళం నుండి పాల్గొన్నారు.

పశు మరణాలను నివారించండి



విశాలాంధ్ర - జికేవీధి : దేశానికీ వెన్నుముక రైతు. అటువంటి దుక్కిటేద్దులు వరుస మరణాలతో అల్లాడి పోతున్నారని బిజెపి అరకు పార్లమెంట్ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి దుక్కేరి ప్రభాకరరావు తెలిపారు. జీకే వీధి మండలం దామనపల్లి పంచాయితీ ఎస్ఆర్ఎన్ కోలనీ గ్రామంలో కనుక అధికారులు వెంటనే స్పందించి ఆగ్రామంలో పశువైద్య శిబిరన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దామనపల్లి పంచాయితీ ఎస్ఆర్ఎన్ కాలనీ గ్రామంలో గత రెండు మూడు నెలల నుండి దుక్కిటేద్దులు పశువులు వరుస మరణాలతో గ్రామ ప్రజలు అల్లాడిపోతునారన్నారు. రైతు వెన్నుముకను కోల్పోతున్నారన్నారు. గ్రామంలో దుక్కిదున్నే ఆరోగ్యం గల ఎద్దులు, ఆవులు,దూడలు ఒకటి రెండు రోజుల్లోనే ఇబ్బంది పడుతూ చనిపోతున్నాయన్నారు. ఏమైందో తెలియని పరిస్థితి ఎం చెయ్యలేని పరిస్థితి ఉందన్నారు. ఆస్తినష్టంతో, వ్యవసాయం పనికి చేతికొందిన దుక్కిటేద్దులు తమ కళ్ళ ముందు చనిపోవటం చూసి వారి బాధలు వర్ణణాతీతమన్నారు. తక్షణమే పంపించి,పశువైద్య శిబిరం ఏర్పాట్లు చేసి గ్రామంలో ప్రతి ఆవులకు,దుక్కిటేద్దులకు, దూడలకు పూర్తి వైద్య పరీక్షలు నిర్వహించి మంచి మందులిచ్చి పశువుల మరణాలను అరికట్టాలని, రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టాటా టీ గోల్డ్, 'మై టర్న్ టు కేర్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ : మాతృదినోత్సవ వేళ ఆ మాతృప్రేమకు నివాళు లర్పించేందుకు టాటా టీ యొక్క వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోకు చెందిన టాటా టీ గోల్డ్ కేర్ ఇప్పుడు 'మై టర్న్ టు కేర్' అంటూ నూతన ప్రచారం ప్రారంభించింది. దీనిలో భాగంగా వినియోగదారులు తమ తల్లితో కలిసి ఉన్న చిత్రంతో కూడిన టాటా టీ గోల్డ్ కేర్‌ప్యాక్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్ది ఆ వినియోగదారులకు అందించనుంది. ఈ వినూత్నమైన, వ్యక్తిగతీకరించిన ప్యాక్‌లలో తమ మాతృమూర్తికి వినియోగదారులు అందించిన ప్రత్యేక సందేశం సైతం ఉంటుంది. ఈ బ్రాండ్ 1000 మంది వినియోగదారులకు 1000ప్యాక్‌లను అందించనుంది. టాటా టీ గోల్డ్ కేర్ ప్యాక్‌లలో ఐదు సహజసిద్ధమైన పదార్థాలైన తులసి, అల్లం, బ్రహ్మి, లవంగం, ములేతి ఉంటాయి. ఈ ప్యాక్‌లను నేరుగా వినియోగదారుల ఇళ్లకు రెండు నుంచి 4 వారాల వ్యవధిలో డెలివరీ చేస్తారు. ఈ ప్రచారం గురించి టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్యాకేజ్డ్ బేవరేజస్ (ఇండియా దక్షిణాసియా) అధ్యక్షుడు పునీత్ దాస్ వివరాలు వెల్లడించారు.

మైచర్లపాలెం రామాలయం నిర్మాణంకు కృషి

విశాలాంధ్ర - చోడవరం : మండలంలోని మైచర్లపాలెం లో నిర్మాణం జరుగుతున్న రామాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ పనులను శనివారం పరిశీలించారు. అనంతరం తిరుపతి దేవస్థానం నుంచి రావలసిన రూ.10,00,000 లక్షల గ్రాంట్ కు సంభందించి డీ.ఈ.తో ఫోన్లో మాట్లాడారు. దేవాలయానికి సంభందించిన పేమెంట్లు తొందరగా చేయమని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బూరేమాణిక్యం, మాజీ సర్పంచ్ బి. శంకర్ రావు, గ్రామపెద్దలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ విజయంతో దేశంలో మార్పు మొదలైంది

విశాలాంధ్ర - చింతపల్లి : కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంతో దేశంలో మార్పు మొదలైందని కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొర్ర సూరిబాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాము ఊహించిన విధంగానే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించిందన్నారు. పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ జూడో యాత్రతో కేంద్రంలో భారతీయ జనతా పార్టీ పునాదులు కదిలాయన్నారు. మతోన్మాదంతో రాజకీయాలు చేస్తున్న బిజెపికి కర్ణాటక ప్రజల తీర్పు కనువిప్పు కావాలన్నారు. రాబోవు రోజుల్లో అన్ని

రాష్ట్రాలలో దాదాపు ఇదే పరిస్థితి కొనసాగుతుందన్నారు. కర్ణాటకలో 224 స్థానాలకు గాను 136 స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదిగిందన్నారు. కర్ణాటక ఎన్నికల నుంచి కాంగ్రెస్ పార్టీ విజయం, భారతీయ జనతా పార్టీ పతనాలు ప్రారంభమయ్యాయని, 2004 లో జరగబోవు సార్వత్రిక ఎన్నికల లో ఆంధ్రప్రదేశ్ లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం తధ్యమని, తద్వారా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని ఆయన జోస్యం చెప్పారు. ఇదే ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ అటు కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ, ఇటు రాష్ట్రంలోని వైకాపా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించడంతోపాటు 2024 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

విశాలాంధ్ర → విశాఖపట్నం → అనకాపల్లి → అల్లూరి సీతారామరాజు

ఆదివారం 14, మే, 2023

బీజేపీకి కర్ణాటక నుంచే కౌంట్ డౌన్ ప్రారంభమైంది

కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న పడాల్

విశాలాంధ్ర - చింతపల్లి : భారతీయ జనతా పార్టీకి కర్ణాటక నుంచే కౌంట్ డౌన్ ప్రారంభమైందని కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు, ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి వీరన్న పడాల్ (బాబులు) అన్నారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ నిర్వహించిన జోడో యాత్ర కర్ణాటక కాంగ్రెస్ లో నూతన ఉత్సాహంతో సత్ఫలితాలు సాధించిందన్నారు. కేంద్రం లో మతోన్మాద పరిపాలన సాగిస్తున్న భారతీయ జనతా పార్టీకి ఈ ఫలితాలు చెంపపెట్టన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కర్ణాటక ఫలితాలు శుభసూచకం అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాన మనమంత్రి అయితే తప్ప రాష్ట్రాలలో నెలకొన్న సమస్యలు పరి ష్కారానికి నోచుకునే పరిస్థితి లేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 500 రూపాయలకే వంటగ్యాస్, పెరిగిన నిత్యవసర ధరలు అదుపులోకి రావడం జరుగుతుందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పై వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. అందుకు కర్ణాటక ఎన్నికలే సాక్ష్యం అనే వారు జోస్యం చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి కర్ణాటక ఫలితాల విజయోత్సవాన్ని పార్టీ శ్రేణులతో కలిసి పంచుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు రొట్టెలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మొట్టడం. బాలరాజు, చిరంజీవి, కృష్ణ, గెమ్మెల సింహాద్రి. పాంగి శ్రీను. అగ్గి రాముడు. చిరంజీవి. మోహన్. మోజెష్, అధిక సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

పాలకవర్గ సమావేశం వెంటనే నిర్వహించాలి

చింతపల్లి, కొయ్యూరు జడ్పిటిసిలు బాలయ్య, నూకరాజు

విశాలాంధ్ర - చింతపల్లి : పాడేరు ఐటిడిఏ పాలకవర్గ సమావేశం వెంటనే నిర్వహించాలని చింతపల్లి కొయ్యూరు జడ్పిటిసి సభ్యులు పోతురాజు బాలయ్య, వార నూకరాజులు అన్నారు. సమావేశం నిర్వహించి ఎనిమిది నెలలు కావస్తున్నా నేటికీ పాలకవర్గ సమావేశం నిర్వహించకపోవడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. మన్య ప్రాంతంలో నెలకొన్న బోయ వాల్మీకులు, బెంతి ఒరియాలను గిరిజన తెగ జాబితాలో చేర్చుతూ ఆంధ్ర ప్రదేశ్ శాసనసభలో తీర్మానం చేయడం, అదేవిధంగా చింతపల్లి, కొయ్యూరు మండలాల సరిహద్దు ప్రాంతమైన సమగిరి, ఎర్రవరం గ్రామాలలో హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణం వంటి సమస్యలపై గిరిజనులలో ఆందోళనలు రేకెత్తిన నేపథ్యంలో పాడేరు ఐటిడిఏ పాలకవర్గంలో చర్చించేందుకు పాలకవర్గ సమావేశం వెంటనే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. గిరిజనులకు ముప్పు వాటిల్లే హైడ్రోపవర్ ప్రాజెక్టు, బోయ వాల్మీకులు, బెంతి ఒరియలను గిరిజన జాబితాలో చేర్చాలని చేసిన తీర్మానాలకు వ్యతిరేకంగా మన్యంలో జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులుగా తాము గిరిజన గ్రామాలలో తిరగలేని పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా గిరిజన ప్రాంతంలో పండించే పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పన లేకపోవడంతో పసుపు రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. చింతపల్లి మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు గోల్ మాల్ కు కారకులైన ఆ శాఖ అధికారులపై చర్యలపై చర్చించేందుకు పాలకవర్గ సమావేశం కీలకమన్నారు. జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఏ అధికారులు చొరవ తీసుకొని వెంటనే పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

జాతీయ ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని

విశాలాంధ్ర - హుకుంపేట : జాతీయ ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళ న చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజ న సంఘం మండల కార్యదర్శి తావుల కృష్ణారావు మాట్లాడుతూ భూర్జా పంచాయితీ, చులిపకోన్, కొండయ్య పాడు గ్రామాలకు చెందిన ఉపాధిహామీ కూలీలకు పనులు ఇప్పటివరకు పనులు కల్పించలేదని ఇకనైనా ఉపాధి పనులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నేటికి ఈ మూడు గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కల్పించక పోవడం దారుణం అన్నారు. నెల రోజుల ఉపాధి పనులు కల్పించనందుకు, ఉపాధిహామీ చట్ట ప్రకారంగా నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఏ పనులు లేక వలస వెళ్ళవలసి వస్తుందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో వలసల నివారణకు ఉపాధి హామీ చట్టం చేస్తే ఉపాధిహామీ సిబ్బంది పనులు కల్పనలో అలస త్యంవహిం చడం అంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. పనులు కల్పన లో నిర్లక్ష్యం వహించిన సిబ్బంది పై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి శాఖ పరమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పనులను తక్షణమే కల్పించక పోతే ఉపాధి హామీ కూలీలతో భారీ ఎత్తున మండల కార్యాలయం ముట్టడి స్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణ్ రావు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కిల్లో రామారావు, ఉపాధి హామీ కూలీలు చంద్రన్న, చిట్టిబాబు, తులసిబాబు చంటి, నన్నారావు, బాలన్న, రమేష్, నాగేష్, పండన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు : ముంచంగి పుట్టు మండలం మాకవరం పంచాయతీ మేబా గ్రామంలో శనివారం పంచముఖ ఆంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవం వేడుక ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అందించిన విగ్రహ ప్రతిష్టోత్సవంలో సుభద్ర మూర్తి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ముందుగా విగ్రహ ప్రతిష్ట అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర మూర్తి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు సంయుక్తంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుభద్ర గారుమాట్లాడుతూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి తనని ఆహ్వానించినందుకు గ్రామస్తులందరికీ ముందుగా ధన్యవాదాలు తెలిపారు. పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో తాను పాల్గొనడం ఓ దైవ నిర్ణయంగా పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన మనలోనూ సమాజంలోనూ నూతన మార్పులను తీసుకొస్తుందని, సత్ప్రవర్తన కు మార్గం చూపుతుందని తెలిపారు సనాతన ధర్మాల సంస్కృతి సాంప్రదాయాలు తెలుసుకోవడం వల్ల చారిత్రక అంశాలు కుటుంబ విలువలు పెంపొందించేలా ఆధ్యాత్మికత ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు అరబీరు జగబంధు సుజన కోట ఎంపీటీసీ సుబ్బలక్ష్మి దోడిపుట్టు ఎంపీటీసీ రఘు వైసిపి నాయకులు దామోదరం పద్మారావు సన్యాసి తిరుపతిరావు గ్రామ పెద్దలు ఐతన్న సుగనో గ్రామస్తులు పాల్గొన్నారు.

భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిడ్జ్ భూషణ్ చరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : గత 20 రోజుల నుంచి ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద భారత దేశ ప్రగతిని ప్రపంచమంతటా చాటిన భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపీ రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిడ్జ్ భూషణ్ చరణ్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని చేస్తున్న మహిళా రెజ్లర్లకి మద్దతు తెలియజేస్తూ శనివారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శులు జీ.ఫణీంద్ర కుమార్, వియ్యపు రాజు మాట్లాడుతూ. భారతదేశ ప్రతిష్టను ప్రపంచమంతా చాటిన మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిడ్జ్ భూషణ్ చరణ్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని గత 20 రోజుల నుంచి ఢిల్లీ లో జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లకు నిరసన తెలియజేస్తున్న ఇప్పటివరకు కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని, జై బోలో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ దేశభక్తిని ప్రదర్శించే బిజెపి ప్రభుత్వం దేశప్రగతి ని ప్రపంచానికి చాటిన మహిళా రిజర్లపై ఈ విధంగా వ్యవహరించడం సరైనది కాదని ఇప్పటికైనా నరేంద్ర మోడీ స్పందించి బ్రిడ్జ్ భూషణ్ చరణ్సింగ్ పై తక్షణమే చర్యలు తీసుకొని మహిళా రెజ్లర్లకి మద్దతుగా నిలిచి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో నాయకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపొందించుకోనేందుకు గ్రంథాలయాలు దోహదం

విశాలాంధ్ర - మల్కాపురం : విద్యార్థులు నైపుణ్యాల పెంపొందించు కోనేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని 40వ వార్డు పరిధిలోని గల షిప్ యాడ్ న్యూ కాలనీ శాఖ గ్రంథాలయం అధికారి బి.కనకరాజు పేర్కొన్నారు శనివారం వేసవి శిబిరాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖను తదితర అంశాలపై శిక్షణతో పాటు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు.

సీపీఐ సీనియర్ కార్యకర్త మృతి

విశాలాంధ్ర - జీకేవీధి : జీకేవీధి మండలం దారకొండ కాలనీకి చెందిన సిపిఐ సీనియర్ కార్యకర్త సుంకరి చిన్నబ్బాయి(56) శనివారం ఉదయం మృతి చెందాడు. ఉదయం సుగర్, బిపి ఎక్కువ అవడంతో దారకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడం జరిగింది. ఆసుపత్రిలో ప్రధమ చికిత్స అనంతరం చింతపల్లి రిఫేర్ చేద్దామనుకునే సమయంలో ప్రాణాలు విడిచారు. గతంలో స్వర్గీయ నర్సింగరావు గోపాలకృష్ణలతో కలిసి సిపిఐ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గనేవారు. ఆదివారం అంతిమ కార్యక్రమంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

లక్ష్మీపురమునకు రూ.40 లక్షలు ప్రభుత్వ నిధులు మంజూరు

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి వివిధ అభివృద్ధి పనులు కోసం ప్రభుత్వ నిధులు రూ.40 లక్షలు మంజూరు చేశారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో డ్రైనేజీ లకు రూ.10 లక్షలు, అంగన్వాడి భవనానికి రూ.6లక్షలు నిధులు మంజూరు చేశారు. రజకులు, పద్మశాలిలు కమ్యూనిటీ భవనాలు నిర్మాణం కు స్థలం, సి.సి.రోడ్లు నిర్మిస్తామని అన్నారు. 20 లక్షలు గ్రాంట్ రాజకులకు కమ్యూనిటి హాల్,5లక్షలు, పద్మశాలిలకు కమ్యూనిటి హాల్, 5 లక్షలు, పెద్ద రామాలయం వద్ద స్టేజ్ నిర్మాణం5 లక్షలు,, శివాలయం కోలని లో కాలువల నిర్మాణం5లక్షలు, కలిపి మొత్తం 20 లక్షలు ఎం.పి. నిధులు నుండి మంజూరు చేశారు. లక్ష్మీపురం గ్రామం నుండి గ్రామాభివృద్ధికి నిధుల నిమిత్తం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామస్థులం కొందరు శనివారం ఎం.పి. కె.సత్యవతి ని అనకాపల్లి లో కలిసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరిసోళ్ల గంగా భవాని, ఆది గణపతి నాయుడు, ఎం.పి.టి. సి. సంద్రాన వీరన్న, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడు దుర్మరణం

మృతుడు మునగపాక మాజీ జెడ్పిటిసి సంజీవ రావు కుమారుడు

విశాలాంధ్ర - రాంబిల్లి : ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి లో రోడ్డులో శనివారం జరిగిన ప్రమాదంలో వైద్యుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మునగపాక మాజీ జెడ్పిటిసి మల్ల సంజీవరావు కుమారుడు మల్ల మురళి (40)మునగపాక కేంద్రంగా హాస్పిటల్ రన్ చేస్తున్నాడు. అదే క్రమంలో ఫార్మసిటిలోని కొన్ని కంపెనీలకు సాధారణ వైద్య తనిఖీలలో భాగంగా వెళ్లి వస్తూ ఉంటారు. శనివారం కూడా ఆయా కంపెనీలకు వైద్య తనిఖీలకు వెళ తూ ఉండగా ప్రత్యేక ఆర్థిక మండలి రోడ్డులో జరిగిన ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మరణించారు. మురళి మృతి వార్త విన్న కుటుంబ సభ్యులు, మునగపాక ప్రజలు తీవ్ర శోక సముద్రంలో మునిగారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన్యం ఉత్పత్తులకు మద్దతు ధరలు ప్రకటించాలి

సీపీఐ పార్టీ జీకే వీధి మండల కార్యదర్శి సత్తిబాబు

విశాలాంధ్ర - జీకే వీధి : మన్య ప్రాంతంలో సాగయ్యే వ్యవసాయ, వాణిజ్య ఉత్పత్తులకు మద్దతు ధరలు ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని భారతీయ కమ్యూనిస్టు పార్టీ జీకే వీధి మండల అధ్యక్షుడు కంకిపాటి సత్తిబాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మన్య ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తులతో పాటు వాణిజ్యపరంగా గిరి రైతులను ఆదుకునే కాఫీ మిరియాలు, పసుపు తదితర పంటలు ఎన్నో ఉన్నాయన్నారు. మన్య ప్రాంత కాఫీకి, అదే విధంగా అంతర్జాతీయంగా మన్య ప్రాంతం పసుపు కు మంచి గుర్తింపు ఉందన్నారు. కానీ మద్దతు ధర లేకపోవడం గిరి రైతులను ఆవేదనకు గురి చేస్తుందన్నారు. కాఫీ, మిరియాలు తర్వాత మన్యప్రాంతపు దేశవాళీ పసుపుకు ఎంతో గిరాకీ ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వము పసుపుకి గిట్టుబాటు ధర కల్పించకపోవడం బాధాకరమన్నారు. రెండేళ్లకు ఒకసారి తవ్వి తీసే మన్య ప్రాంతపు దేశవాళీ పసుపు గతంలో 100 నుంచి 150 రూపాయల వరకు ఉన్న ధర నేడు కనీసం 50 రూపాయలు పెంచకపోవడం తో గిరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పసుపు సాగు మొదలు నాణ్యమైన పసుపుగా తయారు చేసే వరకు రైతులు ఎంతో శ్రమ పడతారన్నారు. వారి శ్రమకు తగిన కూలి కూడా రాకపోవడంతో గిరి రైతులు ఇళ్ల వద్దనే పసుపును రాశులుగా పోసుకోవలసిన పరిస్థితి ఉత్పన్నమైందన్నారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మన్య ప్రాంతపు దేశవాళీ పసుపుకి గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

విశాలాంధ్ర - హుకుంపేట : పెళ్లి వివా హానికి టెంటు వేసేందుకు వెళ్లిన యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో నిర్వహించే పెళ్లికు టెంటు పని చేసేందుకు పాటిమామిడి గ్రామానికి చెందిన కిల్లో ప్రవీణ్ కుమార్(23) వచ్చారు. శనివారం పెళ్లి ఇంటి వద్ద టెంటు వేసేందుకు ఇనుప రాడ్డు పైకి ఎట్టగా విద్యుత్తు లైన్కు తగిలి యువకుడికి షాక్ కొట్టింది. దీనిని గమనించిన తోటి పనివారు, పెళ్లింటి వారు వెంటనే హుకుంపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యా సేవలు అందకపోవటంతో గంట తరువాత 108కు సమాచారం అందించి పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యధికారు లు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. హుకుంపేట ఆసుప్రతిలో వైద్యసి బ్బంది సక్రమంగా ఉండి. వైద్య సేవలు అందించి ఉంటే ప్రాణాలు పోయేవి కాదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ అక్రమాలపై బీజేపీ చార్జిషీట్

విశాలాంధ్ర - పెందుర్తి : వైసీపీ నాయకుల అక్రమాలు ఒకొక్కటి వెలికి తీస్తున్నట్లు బిజెపి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ స్పష్టం చేసారు. రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలపై చార్జిషీట్ పేరుతో బిజేపీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం విశాఖ జిల్లా, వేపగుంటలో నిర్వహించారు. ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గం ఇన్చార్జ్ గొర్లె రామునాయుడు అద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాధవ్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం పేరుతో ప్రభుత్వసంపదను వైసీపీ నాయకులు అడ్డగోలుగా దోచుకుంటున్నారని ఆరోపించారు. పెందుర్తిలో ఎమ్మెల్యే సహా ఆ పార్టీ నాయు కులందరూ అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజలనుండి స్వీకరించిన వినతులను ప్రభుత్వ అధికారులకు చార్జిషీట్ రూపంలో అందిస్తామని తెలిపారు. పెందుర్తి బిజెపి ఇన్చార్జ్ రామునాయుడు మాట్లాడుతూ పంచగ్రామాల భూవివాదంపై ఆనాడు టీడీపీ, ఇపుడు వైసీపీ ప్రజలను మోసం చేసాయని విమర్శించారు. ప్రజలకు న్యాయం చేసేది బిజెపి మాత్రమేనని ఆయన స్పష్టం చేసారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయుకులు నాదేళ్లజ్యోతి, పురిజాల బాలసుబ్రహ్మణ్యం, కాళ్ల జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలో నిత్యం బీసీలపై దాడులు

- బీసీల బ్యాక్ బోన్ విరిచిన జగన్

- టిడిపి గవర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నిత్యం బీసీలపై దాడులు జరుగుతున్నాయని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బీసీల భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకువస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ ఇప్పటికే యువ గళం పాదయాత్రలో ప్రకటించారని బడుగు, బలహీన వర్గాలు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ గవర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర పిలుపునిచ్చారు. స్థానిక లక్ష్మిదేవి పేట లో తెలుగుదేశం పార్టీ గవర సాధికార సమితి ఆధ్వర్యంలో మళ్ళ సురేంద్ర వార్డ్ లో పర్యటించారు.ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ గవర సంఘం నాయకులతో కలిసి ఇంటింటా తిరుగుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయని నిత్యం బడుగు, బలహీన వర్గాలపైన దాడులు జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. బీసీల కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి నిధులు, విధులు కేటాయించకుండా బీసీల బ్యాక్ బోన్ విరిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని మళ్ళ సురేంద్ర దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గవర సంఘం నాయకులు దొడ్డి రాము, దాడి జగన్, కొణతాల శ్రీనివాసరావు, కాండ్రేకుల ముకుంద, దొడ్డి జగ్గారావు, కొణతాల రాంబాబు, దొడ్డి శంకర్, కొణతాల నూకరాజు, భీమరశెట్టి త్రినాథ్ కుమార్, కోరుబిల్లి రమేష్, కొణతాల వాసు, కాళ్ల రాంప్రసాద్, బుద్ధ శివాజీ, మరియు బీసీ నాయకులు పిట్ల రాజు, కొండపల్లి వీరభద్రస్వామి, మత్తుత్తి మహేష్, కొయ్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక కేసులకు పరిష్కార వేదిక జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జాతీయ లోక్ అదాలత్ ద్వారా దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే చక్కని వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పేర్కొన్నారు. కక్షిదారులకు ఇది మంచి అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకొని సులభతర రీతిలో సమస్యలను పరిష్కరించు కోవాలని హితవు పలికారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవా సదన్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మ అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో అన్ని సివిల్ కేసులు, మోటార్ యాక్సిడెంట్, చట్టపరంగా రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, లిటిగేషన్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మోటార్ వెహికల్ కాంపెన్సేషన్ తదితర కేసులు పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి అవకాశాలను కక్షిదారులు తప్పక వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. తిరుమలరావు, రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్. శ్రీదేవి, బార్ కౌన్సిల్ సభ్యులు సిహెచ్. రాంబాబు, ఎస్. కృష్ణమోహన్, బి.అరుణ్ కుమార్, న్యాయమూర్తులు, న్యాయ అధికారులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం

విశాలాంధ్ర - పెదగంట్యాడ : ప్రతీ ఒక్కరూ చిన్ననాటి నుంచే విద్యతోపాటు క్రీడల పట్ల కూడా ప్రత్యేకవంతమైన ఆసక్తిని కనబరచాలని గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి నేటి యువతకు పిలుపునిచ్చారు, నియోజకవర్గం పరిధిలోని మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ)75వ వార్డులో ఉన్న నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(జెడ్పీ హైస్కూల్)పక్కనున్న జీవీఎంసీ క్రీడా మైదానంలో" ఆర్ఎస్ఎన్ ఫౌండేషన్"వారి ఆధ్వర్యంలో ఈనెల ఆరో తేదీనుంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం వేడుకల్లో వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి రమణారెడ్డితో పాల్గొని ఆటతీరును నిశితంగా పరిశీలించి క్రీడాకారులను అభినందించారు, అనంతరం జరిగిన సమావేశంలో క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుంచే క్రీడల పట్ల ప్రత్యేక ఆసక్తిని కనబరిచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తద్వారా మన ప్రాంతం మన దేశం ప్రతిపదంలో పయనింప చేస్తుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు,వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన క్రీడలలో అకుంఠిత దీక్షతో సాధన చేసి ఉన్నత శిఖరాలకు చేరువ కావాలని అంతే కాకుండా క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలతో పాటు ఎన్నో అవార్డులు రివార్డులను పొందడం జరుగుతుందని, దీన్ని ప్రతి ఒక్కరూ ఒక ఉద్యోగంల చేపట్టి క్రీడారంగంలో ముందు కొరకాలని క్రీడాకారులకు ఆమె పిలుపునిచ్చారు, ఫౌండేషన్ ప్రత్యేక ప్రతినిధి, సీనియర్ పాత్రికేయులు దేవాడ వరమహేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ క్రీడా సంరంబ వేడుకలో ఫౌండేషన్ చైర్మన్, వైయస్సార్సీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు,శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వ్యవస్థాపకులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు రావాడ గోవింద రెడ్డి, ప్రముఖ వైద్యురాలు డాక్టర్.పైడి హేమలత,జీవీఎంసీ 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరశింహ పాత్రుడు(కేబుల్ మూర్తి), డీసీఎంఎస్ చైర్ పర్సన్ పల్లా చిన్నతల్లి,వార్డు టీడీపీ ఇంఛార్జ్ పులి సురేష్(బాబీ)రెడ్డి,జాతీయ బీసీ సంక్షేమ సంఘం, యువనేత వైయస్సార్సీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు, ఉత్తరాంధ్ర సర్దార్ గౌతు లచ్చన్న గీత సహకులాల యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఏకుల వెంకటేష్ గౌడ్,ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కోచ్ డి శ్రీనివాస రావు(డీఆర్), జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జేశాఫ్) రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు కార్యంశెట్టి జాన్ వరబాబు,జేశాఫ్ గాజువాక శాఖ నూతన అధ్యక్షులు రాపేటి సునీల్ కుమార్,క్రికెట్ జాతీయ ఎంపైర్ పిట్ట అప్పలరెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు దేవాడ పురుషోత్తం రెడ్డి, దేవాడ రేవతి పురుషోత్తం రెడ్డి, రావాడ వరహాలు రెడ్డి,క్రికెట్ అభిమానులు దూడ లక్ష్మణ రెడ్డి,దూడ కార్తీక్ రెడ్డి,జెర్రిపోతుల సురేష్, క్రీడాకారులు, క్రీడాభిమానులు, న్యాయ నిర్ణేతలు, విశ్లేషకులు, స్థానికులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు,అనంతరం"ఆర్ఎస్ఎన్ ఫౌండేషన్ హార్డ్ టెన్నిస్ నాకౌట్ క్రికెట్ టోర్నమెంట్"విజేతలకు ముఖ్య అతిథులు అమృత హస్తాల మీదుగా అందజేయడం జరిగింది.

ప్రభుత్వ పథకాలను దళితులకు నేరుగా అందిస్తున్న ఘనత జగన్ కే దక్కుతుంది

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు నేరుగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని, పూర్తిగా పేద ప్రజల కోసమే ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున అన్నారు. శనివారం అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ భవనాన్ని మంత్రి నాగార్జున సందర్శించారు. దళిత సంఘాల నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నాగర్జున మాట్లాడుతూ ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ,రాజకీయ వివక్షకు చోటు లేకుండా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. దళితులు కోరిన ప్రతి పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం చేసినట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో కమ్యూనిటీ సెంటర్ లు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నామన్నారు.350 కోట్ల తో విజయవాడలో అంబేద్కర్ మెమోరియల్ స్థూపాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామన్నారు. అంబేద్కర్ భవన్ లో స్టడీ సర్కిల్,డార్మెటరీ, జిల్లాలో డిగ్రీ కళాశాల ఏర్పాటు దళిత సంఘాలు చేసిన అభ్యర్థన మేరకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణ రావు, ప్రధాన కార్యదర్శి జెవి ప్రభాకర్ రావు, ఉపాధ్యక్షులు టి. గురుమూర్తి, కోశాధికారి జి సత్యనారాయణ, జాయింట్ సెక్రెట్రీలు రాంబాబు ,గౌతమ్ బాబు, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, భీమ్ సేన అధ్యక్షులు రవి సిద్ధార్థ ,దళిత నేతలు మాటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.